మదనపల్లె మార్కెట్‌లో రికార్డు స్థాయికి టమోటా ధర

ప్రజాశక్తి-మదనపల్లె రూరల్

మదనపల్లె మార్కెట్‌లో టమాటా ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో టమోటా పంట దిగుబడి తగ్గింది. మదనపల్లె మార్కెట్ పరిధిలో బుధవారం రికార్డు స్థాయిలో కిలో నాణ్యమైన టమాటా రూ.168 పలికింది. మార్కెట్‌కు రైతులు కేవలం 361 టన్నులు మాత్రమే తీసుకువచ్చారు. మార్కెట్‌లో ఏ గ్రేడ్ కిలో రూ.140 నుంచి రూ.168, బి గ్రేడ్ రూ.118 నుంచి రూ.138 వరకు.. సగటున కిలో రూ.132 నుంచి రూ.156 వరకు పలికిందని మార్కెట్ యార్డు కార్యదర్శి అభిలాష్ తెలిపారు. మంగళవారం రూ.140 పలికిన ధర.. ప్రస్తుతం రూ.160కి పైగా పలకడంతో వినియోగదారుల్లో గుబులు మొదలైంది.

రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన టమోటాలు

రీజినల్ డైరెక్టర్ కావలెను!

సిఎం జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో ఇష్టారాజ్యం

ఇ-పోస్టింగ్స్ పేరుతో బదిలీలు, ఉద్యోగోన్నతులు

30 రోజులుగా ఆర్‌డి విధులకు గైర్హాజర్

రీజినల్ డైరెక్టర్ కార్యాలయం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జోన్-4 రీజినల్ డైరెక్టర్ పోస్టుకు రెగ్యులర్ అధికారి నియామకం కొరవడింది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వైఎస్‌ఆర్ కడప జిల్లాలోని రీజినల్ డైరెక్టర్ పోస్టుకు రెగ్యులర్ అధికారి నియామకానికి నోచుకోవడం లేదు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలోని నాలుగు జోన్లలో జోన్-1, జోన్-2, జోన్-3 రీజినల్ డైరెక్టర్లు బదిలీలు, పదోన్నతులు, కౌన్సెలింగ్ వంటి పాలనాపరమైన అంశాల్లో సమర్థ వంతంగా విధులు నిర్వహిస్తున్నారు. కానీ జోన్-4 రీజియన్‌కు రెగ్యులర్ అధికారి కొరవడిన నేపథ్యంలో గతేడాది నవంబర్‌లో నిర్వహించిన స్టాఫ్‌నర్సుల పోస్టింగ్స్ మొదలుకుని ఎంపిహెచ్ఎస్, ఎంపిహెచ్ఒ పోస్టింగ్స్, ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన బదిలీలు, పదోన్నతులు, తాజాగా మరో 313 స్టాఫ్‌నర్స్ రిక్రూట్‌మెంట్ వరకు వివాదాల పరంపర కొనసాగుతూనే ఉంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో గత మే మాసం నాలుగో వారం నుంచి నేటి వరకు జోన్-4 రీజియన్‌లో రెగ్యులర్ స్థాయి రీజినల్ డైరెక్టర్ లేకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. రాష్ట్ర రాజధాని విజయవాడ నుంచి అనిల్‌కుమార్ అనే డైరెక్టర్‌ను అదనపు అధికారిగా నియమించారు. ఆయన జులై మొదటి వారంలో బాధ్యతలు తీసుకున్నారు. జులై 19, 20, 21 తేదీల్లో జోన్-4 పరిధిలోని సుమారు మూడు నుంచి ఐదు వేల మంది అధికారుల బదిలీల సమయంలో విధులకు హాజరయ్యారు. అప్పటి నుంచి నేటి వరకు జిల్లా వైపు తొంగిచూడడం లేదనే విమర్శల వర్షం కురుస్తోంది. ఈ ఏడాది మే నెల చివరి వారం వరకు రెగ్యులర్ రీజినల్ డైరెక్టర్‌గా డాక్టర్ కోటేశ్వరి విధులు నిర్వహిస్తుండేవారు. ఆమె పదోన్నతిపై విజయవాడకు వెళ్లినప్పటి నుంచి రెగ్యులర్ అధికారి నియామకానికి నోచుకోవడం లేదు. ఫలితంగా ఆర్‌డి కార్యాలయ అధికారులు ఈ-పోస్టింగ్ పేరుతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికి ముగ్గురికి బదిలీలు, నలుగురికి పదోన్నతులకు అవకాశం కల్పించారనే గుసగుసలు వినిపిస్తుండడం గమనార్హం. రీజినల్ డైరెక్టర్ పూర్తి స్థాయిలో సంబంధిత ఫైళ్లను పరిశీలించకుండా బదిలీలు చేయడ మేమిటనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా 313 స్టాఫ్‌నర్సుల పోస్టుల కౌన్సెలింగ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 21, 22 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వ హించాల్సి ఉంది. ఈమేరకు ఆర్‌డి కార్యాలయ అధికారులు డిఎంహెచ్ఒ కార్యాలయంలో కౌన్సెలింగ్ ఏర్పాట్లు చేశారు. గతేడాది నవంబర్‌లో నిర్వహించిన స్టాఫ్ నర్సుల కౌన్సెలింగ్‌లో క్షుణ్ణంగా సర్టి ఫికెట్లను పరిశీలనలో దొర్లిన పొరపాట్ల కారణంగా బోగస్ సర్టిఫికెట్ల వివాదం తలెత్తింది. అప్పట్లో సంబంధిత అధికారిని సస్పెండ్ చేయడం, కేసు నమోదు వంటి ఘటనలు చోటుచేసుకున్న సంఘటన తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో రెగ్యులర్ రీజినల్ డైరెక్టర్ అధికారిని నియమించని పక్షంలో బదిలీలు దగ్గర నుంచి పదోన్నతులు, కౌన్సెలింగ్ వంటి అంశాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందనడంలో సందేహం లేదు. సంబంధిత రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు రెగ్యులర్ రీజినల్ డైరెక్టర్‌ను నియమించాలనే వాదన ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నుంచి వినిపిస్తోంది. దీనిపై సంబంధిత సూపరింటెండెంట్ స్థాయి అధి కారిని ఆరా తీయగా 10 రోజులకు ఒకసారి విజయవాడకు ఫైళ్లను తీసుకెళ్తున్నామని పేర్కొనడం గమనార్హం.

ప్రభుత్వ మెడికల్ సీట్లతో వ్యాపారం తగదు : కెవిపిఎస్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రభుత్వం వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీట్లను అమ్ముకోవడానికి అనుకూలంగా ఉండే జిఒ నెంబర్ 108ని ఉపసంహరించుకోవాలని కుల వ్యవస్థ వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు డి.సి.వెంకటయ్య బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పాటు కానున్న కళాశాలలో సీట్లను సెల్ఫ్ ఫైనాన్సు పేరుతో ఫీజులు నిర్ణయించడం అనేక రూపాల్లో పిల్లల తల్లిదండ్రుల డబ్బులు వసూలు చేయడం తగదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఎంబిబిఎస్ చదివే అవకాశం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంబిబిఎస్ చదువును బి కేటగిరి, సి కేటగిరి విభజించి రూ.12 లక్షలు, రూ.20 లక్షలు కట్టే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు లేదని పేర్కొన్నారు. చదువులు అందని ద్రాక్షగా మిగిలిపోతాయని మండి పడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, రిజర్వేషన్లు ఉన్నప్పటికీ పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద మొత్తంలో ఫీజులు పెడితే ప్రజా సేవలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పేదలకు వైద్యం సేవలు భారంగా మారే ఇలాంటి నిర?యాన్ని వెనక్కి తీసుకోకపోతే విద్యార్థు లను కలుపుకొని కెవిపిఎస్‌గా ఆందోళన చేయబడతామని హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని కలెక్టర్ గిరీష తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారితో కలిసి జిల్లా పర్యావరణ ప్రణాళిక సిద్ధం చేసే అంశంపై ముఖ్యమైన 12 శాఖల జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖలు ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ ద్వారా కాలుష్యం నివారణ కొరకు, ధ్వని, వాయు తదితర కాలుష్య నివారణ కొరకు జాతీయ హరిత ట్రిబ్యునల్ మార్గదర్శకాలకు అనుగుణంగా నివేదికలు తయారు చేసి జిల్లా పర్యావరణ ప్రణాళికలు సిద్ధం కొరకు జిల్లా కాలుష్య నియంత్రణ మండలికి త్వరగా సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొత్తగా ఏర్పాటైన అన్ని జిల్లాలకు జాతీయ హరిత ట్రిబ్యునల్ మార్గదర్శకాలకు ఆదేశాల మేరకు జిల్లా పర్యావరణ ప్రణాళికలను సిద్ధం చేయవలసిన ఆవశ్యకత ఉన్నదని పేర్కొన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారు ఇచ్చిన నమూనా టెంప్లేట్‌లలో అవసరమైన సమాచారం ఘన వ్యర్థాల నిర్వహణ, ద్రవ వ్యర్థాల నిర్వహణ, శబ్ద కాలుష్యం, తాగునీటి వనరుల కాలుష్యం, వాహన కాలుష్యం, ఆసుపత్రి వ్యర్థాలనిర్వహణ, మైనింగ్, అటవీ శాఖ కార్యకలాపాలపై నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. ఈ సమాచారం ఆధారంగానే జిల్లా పర్యావరణ ప్రణాళిక తయారు అవుతుందని పేర్కొన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నివేదికలు సిద్ధం చేయాలని తెలిపారు. మునిసిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయతీలు, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, సంపద కేంద్రాలను ఏర్పాటు, వాటి నిర్వహణ సక్రమంగా జరిగేలా చూసి కాలుష్యానికి తావు లేకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కడప ప్రాంతీయ కార్యాలయ పర్యావరణ ఇంజినీర్ ఎస్.అశోక్ కుమార్, సహాయ పర్యావరణ ఇంజినీరు అనిల్ కుమార్, డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య, పోలీస్, మున్సిపల్, రవాణా శాఖ, తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రాధాన్య క్రమంలో పనుల పూర్తికి చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.10.69 కోట్లతో చేపట్టిన ప్రాధాన్యత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో జిల్లాలో ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన పనుల పురోగతిపై సిపిఒ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన ప్రాధాన్యత పనులు ఎన్ని, ఎన్ని పూర్తి చేశారు, ఇంకనూ పూర్తి చేయాల్సినవి ఎన్ని, నాణ్యతగా పనులు పూర్తి చేస్తున్నారా, ఎక్కడైనా సమస్యలు ఉన్నాయా తదితర అంశాలలో ఇంజనీరింగ్ అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లా అభివృద్ధికి రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఎంపీ ల్యాడ్స్ నిధులను కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. రూ.10.69 కోట్లతో 274 పనులు చేపట్టుటకు అనుమతులు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో ప్రణాళిక ప్రకారం ప్రాధాన్యత పనులను ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగిందని చెప్పారు. ఇందులో ఇప్పటివరకు రూ.3.42 కోట్లు ఖర్చు చేసి 97 పనులను పూర్తి చేయడమైనదని పేర్కొన్నారు. మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. సదరు పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన బాధ్యత ఆయా అధికారులపై ఉంది. చేపట్టిన పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు బిల్లులు అప్లోడ్ చేయాన్నారు. 50 శాతం మేర పూర్తి చేసిన పనుల బిల్లులను ఒక వారంలోగా సమర్పించాలి. పనుల పూర్తిలో నాణ్యతలో ఎక్కడా రాజీపడరాదు. ఎక్కడైనా సమస్యలు ఉంటే ఉన్నత స్థాయి దృష్టికి తీసుకురావాలన్నారు. లక్ష్యం మేరకు పనులను పూర్తి చేయడంలో చిత్తశుద్ధితో కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలపై సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో సిపిఒ కృష్ణానాయక్, ప్లానింగ్ శాఖ ఎడి వెంకట్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసన్న కుమార్, ఇఇలు, జెఇలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

వేగవంతంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి-రాయచోటి

జగనన్న హౌసింగ్ లే అవుట్లలో మౌలిక వసతులు కల్పించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తమ ఛాంబర్ నందు కలెక్టర్ గిరీష జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై హౌసింగ్ అధికారులతో సమక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను చేపడుతుందన్నారు. జిల్లాలోని ప్రతి లేఔట్ కు నీటి సౌకర్యం, విద్యుత్తు కనెక్షన్ ఇచ్చి నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలన్నారు. ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. హౌసింగ్ రిలేటెడ్ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి అయ్యేటట్లు చూడాలన్నారు. ఇళ్ల నిర్మాణాలలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కొన్ని మండలాల్లో అనుకున్న స్థాయిలో ఇళ్ల నిర్మాణాలు జరగడంలేదని, ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సుండుపల్లె మండలంలో జగనన్న హౌసింగ్ లేఅవుట్‌కు ఇసుక సమస్య ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా ఇసుక సమస్య లేకుండా తగు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు నీటి సమస్య ఉన్న లేఅవుట్లలో బోర్ వెల్ వేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇకి సూచించారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం కింద జిల్లాలోమంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులందరూ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శివయ్య, హౌసింగ్ ఇఇలు, డిఇలు, ఎఇలు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తొలి దళితోద్యమ దళపతి కత్తి పద్మారావు

మదనపల్లె అర్బన్: తొలి దశ దళిత మహోద్యమాని దళపతిగా వ్యవహరించిన మహనేత డాక్టర్ కత్తి పద్మారావు అని బాస్ డైరెక్టర్ ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప స్పష్టం చేశారు. పద్మారావు 70వ జన్మదినాన్ని ఈ నెల 29న పొన్నూరులోని లంబినివనంలో కులనిర్మూలనా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం బాస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ మాట్లాడుతూ పరమపూజ్య బాబాసాహెబ్ అంబేద్కర్ చేపట్టిన కులనిర్మూలనా పోరాటాన్ని, నాలుగు దశాబ్దాలుగా అవిశ్రాంతంగా ముందుకు నడుపుతున్న మహోన్నత ఉద్యమ శిఖరం కత్తి పద్మారావని చెప్పారు. శివప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో వీసీకే పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్, బాస్ నేతలు రిటైర్డ్ డిప్యూటీ జైలర్ బురుజు లక్ష్మీనారాయణ, రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సి.చంద్రయ్య, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ బి.వెంకటరమయ్య, రాయల్ సూర్య, తెట్టు శ్రీనివాసులు, అగరం నారాయణస్వామి, భాషా పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

బాలల అక్రమ రవాణా నిర్మూలనకు పాటుపడుదాం

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

ఈ నెల జులై 26 నుండి 31వ తేదీ వరకు క్రై, ఫోర్డ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పిల్లల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా, పిల్లల బాల్యాన్ని రక్షించడంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఫోర్డ్ సంస్థ డైరెక్టర్ లలితమ్మ తెలిపారు. బుధవారం స్థానిక ఫోర్డ్ సంస్థ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఐక్య రాజ్యసమితి ప్రతి సంవత్సరం జులై 30వ తేదీ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని గుర్తు చేశారు. బాలల అక్రమ రవాణా అనేది తప్పిపోయిన పిల్లలు, బాల కార్మికులు, అపహరణ, వాణిజ్యపరమైన లైంగిక దోపిడీ, పిల్లలపై ఇతర నేరాల వంటి సమస్యలతో లోతుగా ముడిపడి ఉన్న అంశమన్నారు.పిల్లల అక్రమ రవాణా సమస్యను పరిష్కరించడానికి, ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా క్రై సంస్థ తమ భాగస్వామ్య సంస్థలతో కలిసి జిల్లాలో ఫోర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మదనపలి, పెద్ద మండ్యం మండలాల్లో పోస్టర్లు విడుదల చేయ డం, కాలేజీలు, పాఠశాలలలోని విద్యార్థులకు అవగాహన కల్పిం చడం, గ్రామాలు, కాలనీల్లో సమావేశాలు నిర్వహించి ప్రజలలో అవగాహన కల్పించడం, సంబంధిత ప్రభుత్వ అధికార్లులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.ఈ వారం రోజుల వ్యవధిలో వివిధ ప్రజా ప్రతినిధులు,ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతిని ధులను కలుపుకొని కార్యక్రమాలను నిర్వహిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీధర్, మండల కో-ఆర్డినేటర్ రాధా రాణ, సిబ్బంది నరసింహులు, అల్తాఫ్ బాషా, సంపూర్ణ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిద్దాం

ప్రజాశక్తి-రాయచోటి

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిద్దాం, డ్రాప్ అవుట్స్ లేకుండా చేద్దామని జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి, రాయచోటి మండలం ప్రత్యేక అధికారి పి.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మాధవరం-2 గ్రామ సచివాలయ కార్యాలయం సిబ్బందితో సమావేశమై సమీక్ష చేశారు. బడి ఈడు పిల్లలు ఎందుకు వెళ్ళాలేదని, డ్రాప్ అవుట్స్ ఎందుకుకున్నారని సిబ్బందిని ఆయన ప్రశ్నించారు. పాత సైకంవారిపల్లె నుండి మాధవరానికి వెళ్ళే రోడ్డు పాడైపోవడంతో గతంలో ఉన్న బస్సు సౌకర్యం కూడా నేడు లేనందున ఆడ పిల్లల రక్షణ దృష్టిలో పెట్టుకొని బడికి పంపడం లేదని తల్లితండ్రులు చెప్పుతున్నట్లు సిబ్బంది ఆయనకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి, బస్సు సౌకర్యం కోసం ప్రజాప్రతినిధులు అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇవోపిఆర్డి సురేష్ బాబు, ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం కోఆర్డినేటర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, గ్రామ సచివాలయం కార్యదర్శి షేక్ సహజియ, సుల్తానా పాల్గొన్నారు.

జీరో డోర్ నెంబర్లున్న ఓట్లను పరిశీలించండి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో నమోదైన జీరో డోర్ నెంబర్ ఉన్న ఓట్లను పరిశీలించి త్వరగా సరిచేయాలని కలెక్టర్ గిరీష్ తహశీల్దార్లను, ఇఆర్ఒలను, ఎఇఆర్ఒలను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లోని విసి హాల్‌లో జిల్లాలో నమోదైన డోర్ నెంబర్ జీరో గల ఓటర్ల జాబితా, 100 సంవత్సరాల పైబడి ఉన్న ఓటర్ల జాబితాలపై తహశీల్దారులు, ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలతో కలెక్టర్ గిరీష జూమ్ వీడియో కానారేన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న జీరో డోర్ నెంబర్లు గల ఓటర్ల జాబితాను, ఒకే డోర్ నెంబర్‌తో పది మంది కంటే ఎక్కువ ఉన్న ఓట్లను, 100 సంవత్సరాల పైబడి ఉన్న ఓటర్ల జాబితాను పరిశీలించి సరిచేయాలని అధికారులను ఆదేశించారు. రాజంపేట నియోజకవర్గంలో ఎక్కువగా పెండింగ్‌లో ఉన్న 18 మంది 100 సంవత్సరాల పైబడి ఉన్న ఓటర్ల జాబితాను త్వరగా పరిశీలించి సరిచేయాలని పేర్కొన్నారు. రాజంపేట నియోజకవర్గంలో ఎక్కువగా పెండింగ్‌లో ఉన్న జీరో డోర్ నెంబర్ల ఓటర్ల జాబితాను త్వరగా పరిశీలించాలని తెలిపారు. సరైన ఆధారాలు లేకుంటే తొలగించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

వేదవ్యాస్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలో వేదవ్యాస్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఐఎఫ్ఎస్ నాయకులు నరేష్, అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ నాలుగో తరగతి చదువుతున్న ఉస్మాన్ ఖాన్ అనే విద్యార్థిని ఓ ఉపాధ్యాయుడు చదవలేదని వాతలు పడే విధంగా చితక్కొట్టారన్నారు. మానసికంగా ఇబ్బంది పెడతున్నారని చెప్పారు. విద్యార్థుల దగ్గర వేలకు వేల రూపాయలు ఫీజులు తీసుకుంటూ కనీస మౌలిక సదుపాయాలు లేకుండా విద్యార్థులకు రక్షణ లేకుండా పాత బిల్డింగ్‌లో విద్యా బోధన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం విద్యార్థులు ఆడుకునేందుకు ఆట స్థలం కూడా లేకుండా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారన్నారు. తక్షణం విద్యాశాఖ అధికారులు జోక్యం చేసుకొని సమగ్ర విచారణ జరిపి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి అండర్-19 క్రికెట్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి-కడప

ఈ నెల 27వ తేదీ నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు కడపలోని ఎసిఎ స్టేడియం/కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో ఎసిఎ అండర్-19 మల్టీ డే ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిం చనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్ తెలిపారు. ప్రారంభ మ్యాచ్ ఈ నెల 27వ తేదీ నుండి 29వ తేదీ వరకు నార్త్ జోన్, సౌత్ జోన్ జట్ల మధ్య జరుగుతుందని తెలిపారు. రెండవ మ్యాచ్ ఈనెల 31వ తేదీ నుండి ఆగస్టు 2వ తేదీ వరకు సెంట్రల్ జోన్, నార్త్ జోన్ జట్ల మధ్య జరుగుతుందని తెలిపారు. చివరి మ్యాచ్ ఆగస్టు 4వ తేదీ నుండి 6వ తేదీ వరకు సౌత్ జోన్, సెంట్రల్ జోన్ జట్ల మధ్య జరుగుతుం దన్నారు. మ్యాచ్‌లకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

ఎంఆర్‌పిఎస్ నాయకులకు ఘనసన్మానం

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా ఎర్రమారపల్లి రవీంద్ర మాదిగ, జిల్లా ఇన్‌ఛార్జిగా చెంబకూరు రాజేష్ ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సంగతి విధితమే. ఈ నేపథ్యంలో వీరిద్దరినీ బుధవారం ప్రెస్‌క్లబ్‌లో నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జి ఆరేటి వాసు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి వై.రవీంద్ర మాదిగ మాట్లాడుతూ నాకు ఈ పదవి అప్పగించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజ, జాతీయ నాయకులు నరేంద్రబాబు మాదిగలకు మరియు సహకరించిన స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. మందకృష్ణ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. ముఖ్యంగా మాదిగల చిరకాల కోరిక అయిన ఎ, బి, సి, డి వర్గీకరణ సాధనకు అలుపెరుగని పోరాటం చేస్తానన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవడం జరిగిందన్నారు. ఇంతమంది నాయకులు, కార్యకర్తల సమక్షంలో తనని సన్మానించడం జీవితంలో మర్చిపోలేనన్నారు. అనంతరం ఆరేటి వాసు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమ పోరాటంలో వై.రవీంద్ర, చెంబకూరు రాజేష్ తమదైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. వారి సమర్థతను గుర్తించి జిల్లా పదవులను పార్టీ అధినాయకత్వం అప్పగించిందన్నారు.వారు తమ పదవులకు వన్నె తీసుకొస్తారని కితాబునిచ్చారు. ఈ సన్మాన కార్యక్రమానికి మదనపల్లి డివిజన్ పరిధిలోని ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి నూతనంగా పదవులుఅలంకరించిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో అరేటి వాసు, మనోహర్, వై.రాజా, కౌన్సిలర్ కొండుపల్లి ప్రసాద్ బాబు, తంబళ్లపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దుమ్ము చిన్నా, కొండప్ప, గంగాధర్, సుభాన్, ప్రదీప్, బాలు, సుబ్బు, రామాంజులు, శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజేష్‌ను సన్మానిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు



మాట్లాడుతున్న హబీబుల్లాఖాన్

అభివృద్ధికి అడ్డుకట్ట వేస్తే సహించం

- మదనపల్లి పరిశీలకులు హబీబుల్లాఖాన్

రాయచోటి టౌన్: వెనుక బడిన రాయచోటి ప్రాంతాన్ని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఉంటే టిడిపి నాయకులు ఓర్వలేక పోతున్నారని అన్నమయ్య జిల్లా మదనపల్లి పరిశీలకులు హబీబుల్లాఖాన్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుండుపల్లి రోడ్డు వెడల్పులో భాగంగా మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డి తమ పార్టీ నాయకులతో కలిసి చేసిన వాక్యాలు సిగ్గుచేటని రోడ్డు వెడల్పు చేస్తున్న తరుణంలో దుకాణదారులు ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని గత ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడు సంవత్సరాలు కరోనా కారణంగా మరింతగా జరగాల్సిన అభివృద్ధి జరగలేదని కేవలం రెండు సంవత్సారాలు పరిపాలనలో ఎన్నడూ లేని విధంగా రాయచోటి పట్టణం అభివృద్ధి జరుగుతుందని దాన్ని చూసి ఓర్వలేక పోతున్నారని అన్నారు.కేవలం నన్ను ఎమ్మెల్యే చేయండి, చంద్రబాబును సిఎం చేయండి అనే శ్లోకం చదువుతూ వస్తున్నారని విమర్శించారు. రాయచోటి జిల్లా కేంద్రం మార్చేస్తామని బహిరంగంగా చెబుతున్న టిడిపి నాయకులు పల్లెతి నోటిమాట కూడా అనలేదని ఇలాంటివారు రాయచోటి ప్రజలకు ఏలాంటి మేలు చేస్తారని ప్రశ్నించారు. రోడ్డు వెడల్పు సమయంలో మున్సిపల్ చైర్మన్, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు దుకాణదారులతో మాట్లాడి కలిసికట్టుగా రోడ్డు వెడల్పుకు సహకరించాలని విన్నవించుకున్నామన్నారు. దుకాణాదారులు, భవన యజమానులు ఎవరు కూడా టిడిపి నాయకులకు ఫిర్యాదు చేయలేదని కేవలం రాజకీయం చేయాలనే ఉద్దేశంతో అభివృద్ధిని అడ్డుకట్ట వేయాలని ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

విద్యార్థులకు ఆత్మరక్షణ ముఖ్యం

మదనపల్లె అర్బన్: పట్టణంలో జరిగిన ఆత్మరక్షణ పోటీలలో విజయభారతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చారు. బుధవారం మెడల్స్ సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు విద్యార్థులను అభినందించారు. కరాటే గ్రాండ్ మాస్టర్ డాక్టర్ ఎఆర్ సురేష్, కరాటే మాస్టర్ ఎం.మణి సాయిలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణ విద్య పోటీలలో విజయకేతనం ఎగురవేసిన విజయ భారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాబోయే రోజులలో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం కరాటే మాస్టర్ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ఆత్మరక్షణ విద్య పోటీలలో విజయభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటి 11 గోల్డ్ మెడల్, 5 సిల్వర్ మెడల్,6 బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారని వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాటాడుతూ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు ఇచ్చిన ప్రోత్సాహం,కరాటే మాస్టర్ సురేష్ ఇచ్చిన కోచింగ్ పథకాలు సాధించడానికి కారణమైందని కొనియాడారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

పీర్లను దర్శించుకున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే 'మేడా'

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

పట్టణంలోని నాగులమానుపేటవీధిలో మొహర్రం మాసం సందర్భంగా ఏడవ రోజు ఉత్సవాల్లో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. ఉత్సవ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పీర్ల చావిడిలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పీర్ల చావడి వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని పీర్లను భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో షామీర్‌బాషా, రవాణాశాఖ డైరెక్టర్ గుల్జార్‌బాషా, రాజంపేట వార్డు కౌన్సిలర్ నవీన్‌శెట్టి, రాజేష్, అవినాష్, భాజామొహిద్దీన్, కాలేషా, మున్నా, రహమతుల్లా, ఇమ్రాన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

ఒబులవారిపల్లె మండలం ఓరంపాడు గ్రామం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన మస్తే రుకాల ఉమర్ హమీద్, ఏసుగుల శంకరయ్య కుటుంబ సభ్యులకు రూ.2లక్షలు చొప్పున చెక్కులను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అందించారు. కార్యక్రమంలో రాజంపేట తహశీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డి, నాయకులు మందరం వేణుగోపాల్‌రెడ్డి, ఆనంనాగేంద్ర, భాజామొహిద్దీన్, మురళి ఆచారి, భీమరాజు పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి

విద్యార్థులు దేశభక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ప్రతి విద్యార్థి కూడా దేశభక్తి భావాన్ని పెంపొందించుకోవాలని శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి మొదట కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన అమర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గిల్ విజయ స్ఫూర్తితో ప్రతి విద్యార్థి దేశభక్తి భావాన్ని పెంపొందించుకొని క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సహదేవరెడ్డి, సుందర రూపు, శాంతయ్య కళ్యాణి, అనూష అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. **కురబలకోట :** స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్ వార్షికోత్సవం ను ఘనంగా నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.కమర్ బాషా అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే-జులై 1999 లో కార్గిల్ డిస్ట్రిక్, కాశ్మీర్‌లో భారత్-పాకిస్తాన్ మధ్య జరిగిన నాలుగో భీకర సంగ్రామంలో పాకిస్తాన్ ఆక్రమించు కున్న టైగర్ హిల్స్‌ను స్వాధీన పరుచుకొని భారత దేశ సౌర్యాన్ని, దేశ కీర్తి ప్రతిష్టలను ఎగురవేసి ప్రపంచ దేశాలకు భారత దేశ సైనిక సత్తా చాటారన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి లెఫ్ట్ నెంట్ డాక్టర్ ఎన్.నవీన్ కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో ఎంపిపి శ్రీదేవిరవికుమార్

గృహ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-కలకడ

నూతన గృహ నిర్మాణాలకు అనుమతులను మంజూరు చేయాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని కోరారు. బుధవారం కలికిరి మండలం మహల్ గ్రామంలో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె ఎమ్మెల్యేను, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహమ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి 95 శాతం అమలు చేశారని తెలిపారు. గృహాల కోసం నూతన దరఖాస్తు చేసుకున్నారని వాటికి అనుమతులు ఇచ్చేందుకు సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రవికుమార్ పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడిని కలిసిన మేడా విజయశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-నందలూరు

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడును బుధవారం రాజంపేట నియోజకవర్గం యువ నాయకులు మేడా విజయశేఖర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేడా విజయ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ను కలసిన సందర్భంలో రాజంపేట నియోజకవర్గ రాజకీయాలలో చర్చనీయంగా మారిందన్నారు. నియోజకవర్గ పరిస్థితులను పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. రాజంపేట అసెంబ్లీ స్థానానికి పార్టీ తనకు టికెట్ కేటాయిస్తే తప్పనిసరిగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. నేడు నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు భిన్నంగా మారాయని, రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించకపోవడం, మెడికల్ కాలేజీని ఇతర ప్రాంతంలో ఏర్పాటు చేయడం, అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేయడం, ప్రజలు కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE-PILER.

I.A.No. 135/2019

O.S.No. 4/2019

V.Vijay Kumar. ...Petitioner/Plaintiff

Vs

B.Reddeppa. ...Respondent/Defendant

NOTICE TO DEFENDANT

Sri Bokkasam Reddeppa, S/o Adi Murthy, L.R. Street, Vayalpad Town and Mandal, Annamayya District.

Sir,

Please take notice that the above plaintiff filed the above I.A.No.135/2019 in O.S.No.4/2019 against you for execution of regular registered sale deed by you in favor of the plaintiff and the above case is posted to 08-08-2023 at 10.30 A.M. for your appearance before the above court either in person or through an advocate and file your objections if any. Otherwise the matter will be decided ex-parte.

//By order of the Court//

G.SIVA KUMAR REDDY

Advocate for plaintiff,

PILER- 517 214,

Mobile No.99518 96569.

పేరు మార్పు

నెల్లూరు జిల్లా బాలాయపల్లి, మెయిన్ రోడ్, పోలీసుస్టేషన్ ఎదురుగా డోర్ నెంబర్ 1/95 కాపురస్తులు పాలూరు పిచ్చయ్య గారి కుమారుడనైన పాలూరు దామోదర అను నేను ఈ దినం నుండి పాలూరు దామోదర్ సన్నాఫ్ పాలూరు పిచ్చయ్య గా పేరు మార్చుకున్నాను.

వైసిపితోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం :'చింతల'

ప్రజాశక్తి-కలికిరి

వైసిపి పాలనలో అన్ని వర్గాలకు సముచిత స్థానం లభించిందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మహల్ గ్రామంలో గడపగడప కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కారం అయ్యేవిధంగా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో నవరత్నాలలో భాగంగా ప్రతి ఇంటికి ఏదో ఒక లబ్ది పొందారని అన్నారు. ముఖ్యం మైనార్టీలకు పెద్దపీట వేయడం మన జగనన్న ప్రభుత్వంలోనే జరిగిందని, ముఖ్యం మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ తెలిపారు. ఇటీవల పల్లవల్లి గ్రామానికి చెందినటువంటి నరేష్ ప్రమాదవశాత్తు చనిపోగా వైఎస్ఆర్ బీమా పథకం కింద రూ.5లక్షల చెక్కును నరేష్ భార్య చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ముఖ్యం మైనార్టీ యువనాయకులు అష్రఫ్ పాల్గొన్నారు. కార్యక్రమం "మంలో ఎంపిడిఓ గంగయ్య యాదవ్, తహశీల్దార్ భాగ్యలత, విద్యుత్ శాఖ ఎఇ ముజీర్ రహ్మాన్, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, జడ్‌పిటిసి పద్మజ లోకవర్ధన్, సీనియర్ నాయకుడు నల్లారి తిమ్మారెడ్డి, ప్రచార కార్యదర్శి ఆగామొద్దీన్, జిల్లా ఎస్‌సి సెల్ కార్యదర్శి వి.హరి, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల కో-ఆప్షన్ మెంబర్ రిజ్వాన్, వేంపల్లి ఖాదరవల్లి, వేంపల్లి ఫయాజ్ వేంపల్లి బావాజీ, శివాజీ, రత్న శేఖర్ రెడ్డి పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మండలంలోని మద్దయ్యగారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ని ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు.ప్రజల సమ స్యలపై ఆరా తీసి వాటిని అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో సత్వరం పరిష్కరించడం జరిగిందన్నారు.అదేవిధంగా ప్రతి మారుమూల గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సయ్యద్‌బాషా, సర్పంచ్ రామంజులు, కో -ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలి, నాయకులు డ్రిప్ రమణ, చంద్ర పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనాన్ని అందించండి

భోజనాన్ని పరిశీలిస్తున్న మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలను బుధవారం మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు చౌడేశ్వర్, వాటర్‌షెడ్ చైర్మన్ వైవి.రమణారెడ్డిలు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో విద్యార్థుల నుంచి ఫిర్యాదులు అందుకున్నారు. భోజనంలో పురుగులు, నీళ్ల రసం, చప్పిడి పప్పు, అరకొరా చికెన్ వడ్డిస్తున్నారని ఈ భోజనం తినలేక అర్థాకిలితో అలమటిస్తున్నట్లు చెప్పారు. రాత్రిపూట దోమల బెడదతో విద్యార్థులు అనారోగ్యానికి గురి కావడం, నిద్ర కరువై విద్యపై శ్రద్ధ చూపలేక పోవడం లాంటి సౌకర్యాలపై ప్రిన్సిపల్ పట్టించుకోరని తెలిపారు. ఉపాధ్యాయుల బోధన సక్రమంగా లేదని వారికి మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు ప్రిన్సిపాల్ కన్నయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు పెట్టే భోజనంపై కక్కుర్తి పడతారని ప్రశ్నించారు. తహశీల్దార్ శ్రీనివాసులుకు ఫోన్ చేసి గిరిజన గురుకుల పాఠశాలకు నాణ్యమైన బియ్యం ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. భోజనం వండే వంట వారిని పిలిపించి ప్రశ్నించగా ప్రిన్సిపల్ సకాలంలో సరుకులు ఇవ్వరని కూరగాయల గదికి తాళం వేసుకొని వెళ్తారని చెప్పారు. గత పదవ తరగతి పరీక్షల్లో సైతం పాఠశాలలో కేవలం ఎనిమిది మంది విద్యార్థులు మాత్రమే పాసై మండలంలోనే చివరి స్థానం రావడంపై పలు సబ్జెక్టులకు టీచర్లు లేరని గ్రహించారు. వారం రోజుల్లో విద్యార్థుల కు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం తోపాటు ప్రతి విద్యార్థి విద్యలో రాణించి వందశాతం ఫలితాలు సాధించాలన్నారు.

నేడు కోసువారిపల్లెలో గడప గడపకూ..

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లి గ్రామ సచివాలయం పరిధిలోగురువారం కొప్పులోలపల్లి, గుమ్మడికాయలపల్లి, ఎర్రోళ్లపల్లి, ఆనిగాని పల్లి, వడ్డేపల్లి, చిట్కలపల్లి, పాయిలోలపల్లి, పెద్దగుట్టపల్లి, సింగారెడ్డి గారి వారి పల్లి నల్ల తిమ్మారెడ్డి గారి పల్లి, చిన్న రెడ్డివారి పల్లి ,మాలపల్లి, తరిగొల్లపల్లి, తిరుమల గుట్టపల్లి,కో సువారి పల్లి కస్బా, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పాల్గొంటారని వైసిపి పార్టీ వర్గాలు తెలిపారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

కొత్త చాపలవారిపల్లి గ్రామ సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని కొత్తచాపలవారిపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్టేట్ ముదిరాజ్ సంఘం డైరెక్టర్ భువన బోయిన లక్ష్మీనరసయ్య, ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా బుధవారం లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ నాడు-నేడు మూడో విడతలో పిల్లలకు చదువుకోవడానికి ఒక స్కూలు నిర్మించి ఇవ్వాలని, గ్రామంలోని వంద కొత్త ఇళ్లకు గాను వాలంటీర్ వ్యవస్థను నియమించాలని కోరారు. ఈ విషయంపై స్పందించిన ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఈ సమస్యలను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ మెంబర్ కలీం ఖాన్, పునగాని గుణ యాదవ్, ఎల్లమరాజుపల్లి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో సవరణకు ఇంటింటా సర్వే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని గుమ్మసముద్రం గ్రామ పంచాయతీ, బుచ్చిరెడ్డిగారిపల్లిలో ఓటరు జాబితా సవరణ-2024 కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇంటింటా సర్వే నిర్వహించారు.మాజీ ఎంపిటిసి కొత్తపల్లి శ్రీనివాసులు పర్యవేక్షణలో సర్వే నిర్వహించారు. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు. కొత్తగా ఓటు నమోదుకై కేంద్ర ఎన్నికల సంఘం ఆగష్టు 21 వరకు అవకాశం కల్పించింది. ఓటరు జాబితాను పరిశీలనకు మాజీ ఎంపిటిసి కొత్తపల్లి శ్రీనివాసలు పరిశీలించగా విఆర్‌ఎ మాబు, బూత్ కన్వీనర్ బండిరమణలు ఓటరు సవరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గురుప్రసాద్, బొంతే ప్రసాద్, ఎం.నరసింహులు, తిరుమల రెడ్డెప్ప, రమణప్ప, బండి శంకర, బండి నరసింహులు, బండి అశోక్ కుమార్, సదుం రమణప్ప, డి.మల్లికార్జున, మంచాల శంకర, గ్రామవాసులు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగులో యజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రైతులు ఉద్యాన పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యాన పరిశోధన కేంద్రం అనంతరాజుపేట సీనియర్ సైంటిస్ట్ శ్రీధర్ అన్నారు. ఆత్మ అధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో రైతులకు, ఆర్‌బికె సిబ్బందికి ప్రస్తుత సీజన్‌లో ఉద్యాన పంటల్లో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మామిడి, అరటి, బొప్పాయి పంటలలో మెలుకువలను, మామిడి లో కొమ్మల కత్తిరింపు, ఎరువుల యాజమాన్యం, బొప్పాయిలో చీడ పీడలు యాజమాన్యం, అరటిలో తెగుళ్ల యాజమాన్యం పద్ధతుల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుధాకర్, ఉద్యాన శాఖ అధికారి భాస్కర్, ఆత్మ బిటిఎం బాలసుబ్రమణ్యం, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గాలివీటమ్మకు రూ.5 లక్షలు విరాళం

ప్రజాశక్తి-గాలివీడు

గ్రామంలోని పక్కిరరెడ్డిగారిపల్లి కుశావతి నది తీరాన ఉన్న గాలివీటమ్మ అమ్మవారి గుడికి వీరబల్లి వాస్తవ్యులు గాలివీటి భాస్కర్ రెడ్డి కుమారుడు గాలివీటి విజయ్ సాగర్‌రెడ్డి అలియాస్ మదన్ రెడ్డి బుధవారం రూ.5 లక్షలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ప్రతి ఏడాది వారికుటుంబ సభ్యులు పట్టు వస్త్రాల సమర్పణ, ఆలయ అభివృద్ధికి నిధులు కూడా అందిస్తున్నారు. కార్యక్రమంలో హేమకుమార్‌రెడ్డి, గొట్లమిట్ట, సాయినాథ్‌రెడ్డి, మహేష్ బాబు, పూజారి సంపత్ పాల్గొన్నారు.

'స్పందన'లో తమకు న్యాయం జరగలేదు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని హసనాపురం పంచాయతీ కుమ్మరపల్లికి చెందిన రైతు బి.రామాదేవి తమ పొలం ఆనుకొని 20 అడుగుల దూరంలో హసనాపురం గ్రామం ఎర్రంగివాండ్లపల్లికు చెందిన రైతు సహదేవరెడ్డి బోరు వేస్తున్నారని ఈ బోరు వేస్తే తమ పొలానికి నీరు అందదని సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన తమకు న్యాయం జరగలేదని బుధవారం రామాపురంలో విలేకరుల ఎదుట రామాదేవి అనే రైతు వాపోయింది. తమకు హసనపురం గ్రామ పొలం సర్వేనెంబర్ 1986లో 3.91 ఎకరాల్లో వ్యవసాయ భూమి ఉందని ఆ భూమిలో దాదాపు 13 సంవత్సరాల కితం బోరు వేసుకొని వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నానని ఆమె తెలిపారు. హసనపురం గ్రామం ఎర్రంగివాండ్లపల్లెకు చెందిన రైతు సహదేవరెడ్డి అనే రైతు తమ పొలం ఆనుకొని 20 అడుగుల దూరంలో బోరు వేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఆ ఫిర్యాదును రామాపురం తహశీల్దార్‌కు బదిలీ చేశారని అన్నారు. తమకు విఆర్‌ఓ ఫోన్ చేసి మీరు తహశీల్దార్ కార్యాలయం వద్దకు రావాలని చెప్పి వచ్చాక మీరు ఇద్దరూ సర్దుకొని పోవాలని సూచించారని అన్నారు.తమ న్యాయం చేయకుండా ఫిర్యాదును మూసివేసినట్లు చెప్పారన్నారు. అధికారులు తమ న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై మండల ఆర్ఐ రవికు మార్‌ను వివరణ కోరగా రమాదేవి పొలం ఆనుకొని సహదేవరెడ్డి బోరు వేసిన విషయం వాస్తవమేనన్నారు. ప్రస్తుతం సహదేవరెడ్డి 20 అడుగుల దూరంలో బోరు వేశారని, ఈ విషయంపై రైతు సహదేవరెడ్డికి వాల్టా చట్టం ప్రకారంగా 250 అడుగుల దూరంలో బోరు ఉండాలని ఈ బోరు మోటర్ బిగించవద్దని సూచించామని, మోటర్ బిగిస్తే సీజ్ చేస్తామని రైతుకు చెప్పినట్టు ఆయన స్పష్టం చేశారు.

విద్యార్థుల నమోదు వంద శాతముండాలి

రామాపురం : ప్రభుత్వ పాఠశాలతో పాటు కస్తూర్బా గురుకులం, ఆదర్శ పాఠశాలల్లో వందశాతం విద్యార్థుల నమోదుకు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి సుస్మిత, తహశీల్దార్ అరవింద్‌కిషోర్ అన్నారు. మండలంలోని కస్తూర్బా, ఆదర్శ పాఠశాల, గురుకుల పాఠశాలను మండల అధికారుల బృం దం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతవరకు పాఠశాల ల్లో విద్యా ర్థుల నమోదు ఎంత శాతం జరిగిందని ప్రధానో పాధ్యా యులను అడిగి తెలుసు కున్నారు. జగనన్న గోరుముద్ద, పౌష్టికాహారం, మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం సక్రమంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎఒ శివశం కర్, ఎంఇఒలు రామకృష్ణుడు, జయచంద్ర, రవికుమార్, ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో ఎంపిపి ఆకస్మిక తనిఖీ

కలకడ : మండలంలోని బాటవారిపల్లి సచివాలయం బాటవారిపల్లెలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంపిపి తనిఖీలు నిర్వహించారు. కేంద్రంలో విద్యార్థుల హాజరు కార్యకర్త, ఆయాల హాజరు పరిశీలించినట్లు తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం వడ్డించాలని పౌష్టికాహారాలను సక్రమంగా అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలకు ఇవ్వాల్సిన పౌష్టికాహారాన్ని ప్రతిరోజు అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ శాంతాబాయి, కార్యకర్త ఎర్రమ్మ, సహాయకురాలు రాణెమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న దంత వైద్యులు డాక్టర్ బాబా ఫక్రుద్దీన్ ,నర్స్ నీలిమ, సీనియర్ అసిస్టెంట్ శివప్రసాద్, అటెండర్ చలపతిలను డాక్టర్లు, వైద్య సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పావని మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. డాక్టర్ బాబా ఫక్రుద్దీన్ కోవిడ్ సమయంలో కోవిడ్ నిర్వహణపై శిక్షణ పొంది ప్రమాదకరం అని తెలిసినా ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా సేవలు అందించడం అమోఘమన్నారు. పలుసేవ కార్యక్రమాలు నిర్వహించి పలువురికి ఆర్థిక సహాయ సహకారాలు అందించినారన్నారు. పలువురి మన్నలలో పొంది గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ప్రత్యేక కార్యక్రమంలో వారిని పూలమాలల శాలవాలతో సత్కరించి మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు వెంకటరామయ్య, విక్రాంత్‌రెడ్డి, రూప, షబానా ఫాతిమా, తేజశ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమంతంగా ఉండాలి

ప్రజాశక్తి-రామాపురం

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైద్య అధికారి డాక్టర్ విజయకుమార్ పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాల పరిస్థి తుల్లో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నా యని అన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాలలో అంటువ్యాధులపై సర్వే కూడా నిర్వహించామని, అందుకు సంబంధించి స్థానిక ప్రాథమిక ఆరోగ్య

మాట్లాడుతున్న డాక్టర్ విజయకుమార్

కేంద్రంలో 150 కి పైగా రోగులు వస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా వైరల్ ఫీవర్స్ వచ్చే అవకాశాలు నీటి మార్పు వల్ల ఇతరత్రా వ్యాధులు కూడా సోకే ప్రమాదముందన్నారు. తరచుగా వ్యాధుల బారినపడితే వెంటనే ప్రభుత్వ వైద్య అధికారి సంప్రదించి చికిత్సలు నిర్వహించుకోవాలన్నారు. రక్తపరీక్షలతో పాటు ఇతర పరీక్షలు ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. దోమలు పెరిగే అవ కాశం ఉందని ప్రతి ఒక్కరూ దోమతెరలు తప్పక వాడాలని ఆయన సూచిం చారు. ఇంటి పరిసరాలు వద్ద మురికి గుంటలు లేకుండా చేయాలని వారానికి ఒకరోజు డ్రైడే పాటించాలని తెలిపారు. మురికిగుంటల్లో, డ్రైయినేజీ కాలవల్లో బ్లీచింగ్ పౌడర్ పిచకారి చేయాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మలిశెట్టి వెంకటరమణ

పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌పై మంత్రి జోగిరమేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికావని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ అధినేత పవన్‌ను జంతువులతో పోల్చి అనుచితంగా మాట్లాడడం తగవని, వ్యక్తిగత దూషణలు, వెర్రి మాటలు మానుకోవాలని హెచ్చరించారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరిట రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి లాగి రాష్ట్ర అభివృద్ధిని విస్మరించారని అన్నారు. నవరత్నాలు కూడా సంపూర్ణ స్థాయిలో అమలు చేయలేక ప్రభుత్వం కొట్టుమిట్టాడుతోందన్నారు. పవన్ కళ్యాణ్ ను దూషించేందుకే వైసిపిలో కొన్ని శాఖలను ఏర్పాటు చేశారని అన్నారు. ఇకనైనా వ్యక్తిగత దూషణలు మాని రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నంద్యా లహరి, వీరయ్య ఆచారి, గోపి, హేమంత్, పెంచలయ్య, రాఘవ, వీర మహిళలు జెడ్డా శిరీష పాల్గొన్నారు.**రాయచోటి :** జనసేన అధినేత పవన్ కల్యాప్ మంత్రి జోగి రమేష్ చేసిన వ్యక్తిగత ఆరోపణలు సరికాదని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ ముక్రం చాన్, నియోజకవర్గం ఇంచార్జ్ షేక్ హసన్ భాష, సీనియర్ నాయకులు రామ శ్రీనివాస్ పేర్కొన్నారు. మీకు మంత్రి పదవులు ఇచ్చింది పవన్‌ను విమర్శించడానికా లేక ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడానికి అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు షేక్ రియాజ్, పట్టణ నాయకులు షబ్బీర్ అలీ, ఖాసిమ్, యువ నాయకులు దినేష్, విజయ్ పాల్గొన్నారు.

అథ్లెటిక్ కోచ్ మృతదేహానికి 'చమర్తి' నివాళి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని తాళ్లపాక గ్రామపంచాయతీ, యాల్లాగడ్డకు చెందిన అథ్లెటిక్ కోచ్ హరిక్రిష్ణ తిరుపతికి వెళుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన మృత దేహానికి బుధవారం టిడిపి నియోజకవర్గ నాయకులు చమర్తి జగన్మోహన్‌రాజు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌమ్యు డైనటువంటి హరికృష్ణమ రాజు లాంటి వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఈదుర్ఘటన నుంచి కుటుంబ సభ్యు లు త్వరగా కోలుకోవాలని ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని నింపారు. కార్యక్రమంలో నాయకులు పాండు రంగరాజు, రఘురామరాజు, శేషారెడ్డి, సూర్యనారాయణరాజు, సురేష్, కేతా రాజశేఖర్, రాజేష్‌వర్మ పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి

సమీకృత వ్యవసాయ పద్ధతులతో మెరుగైన ఫలితాలు

ప్రజాశక్తి-కలికిరి

వ్యవసాయంలో సమీకృత వ్యవసాయ పద్ధతులు పాటిస్తేనే మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలి సభ్యులు కె.యస్.బోదేశావల్లితో కలసి కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం, డాక్టర్ జిఎన్‌పాండురంగ, కృషివిజ్ఞాన కేంద్రం సమన్వయకర్త వారికి కెవికె కార్యక లాపాలు గురించి వివరించి, కెవికెలోని ప్రదర్శన క్షేత్రాలను వేరుశనగ వితనోత్పతి క్షేత్రం, పెరటికోళ్ళ పెంపకం, వాన పాముల ఎరువుఉత్పతి కేంద్రం, భూసార పరీక్షా కేంద్రం, అజొల్ల యూనిట్, పాలీహౌస్, షేడ్‌నెట్ నర్సరీ సందర్శిం చారు. వ్యవసాయం లాభసాటిగా రావడానికి వ్యవసాయంలో సమీకృత వ్యవసాయ పద్దతులు పాటించాలని వ్యవసాయ వారు సూచించారు. మండలి సభ్యులు బోదేశావల్లి మాట్లాడుతూ మామిడిలో అంతర పంటల సాగు వల్ల అదిక దిగుబడి పొందవచ్చని అన్నారు. జిల్లా ఉద్యాన అధికారి రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ స్థాపనపై సలహాలు ఇచ్చారు. కృషి విజ్ఞాన కేంద్రంలో వాయల్పాడు, పీలేరు డివిజన్ రైతు భరోసా కేంద్రం ఇన్‌ఛార్జి ప్రధాన పంటలలో మేలైన యాజమాన్యం పద్ధతుల పై శాస్త్రవేత్త సోమశేఖర్‌బాబు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రం పనితీరు పై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి రవికుమార్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ , కె వికె శాస్త్రవేత్తలు, రైతు భరోసా కేంద్ర సహాయకులు పాల్గొనారు.

ఇ-పంట నమోదు తప్పనిసరి

కలికిరి : రైతులు పండించే పంటలపై ఇ-పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయ జిల్లా అధికారి చంద్రనాయక్ తెలిపారు. బుధవారం వాల్మీకిపురం, పీలేరు డివిజన్లకు సంభంధించిన ఆర్‌బికె సిబ్బంది, ఖరీఫ్ 2023 - 24కు సంబంధించిన ఇ-పంట నమోదుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంట వివరాలను ప్రతి రైతు ఇ-పంట నమోదు చేసి, వారికి సంభంధించిన రశీదులు తప్పనిసరిగా అందజేయాలని తెలిపారు. ఆర్‌ఎస్‌ఇ సిబ్బందిని వ్యవసాయశాఖలో ప్రస్తుతం అమలులో వున్న పథకాలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిఐఎల్‌ఒ రవి, జిల్లా వ్యవసాయి సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు బోదేషావల్లి, వీత్మాకిపురం ఎడిఎకె వాణిశ్రీ, పీలేరు ఎడిఎ రమణారావు, కలికిరి, కలకడ, వాయిలాడు, గుర్రంకొండ, పెద్దమండ్యం, కె.విపల్లి మండల వ్యవసాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి బదిలీ

గాలివీడు : స్థానిక ఎంపిడిఒగా ఎం.శ్రీనివాస్‌రెడ్డి పులివెందుల నుంచి బదిలీపై జూన్ నెల నుంచి ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. అనంతరం ఇక్కడి నుంచి కడప డిపిఒ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇఒపిఆర్‌డిగా ఉన్న శేఖర్‌నాయక్ ఎంపిడిఒగా బాధ్యతలు తీసుకున్నారు.

విద్యార్థిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

రాజంపేట అర్బన్ : విద్యార్థిపై దాడి చేసిన వేదవ్యాస్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం టిఎన్ఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఎస్ఎన్ కాలనీ దగ్గర ఉన్న వేదవ్యాస్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిపై విచక్షణ కోల్పోయి ఉపాధ్యాయుడు చదవలేదనే కోపంతో వాతలు పడేవిధంగా కొట్టడం దారుణమన్నారు. అధిక ఫీజులు వసూలు చేసుకుంటూ, కనీస మౌలిక సదుపా యాలు లేకుండా, విద్యార్థులకు రక్షణ లేకుండా పాత భవనంలో విద్యాబోధన చేస్తున్నారన్నారు. తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు ఘటనపై స్పంది స్తూ పూర్తిస్థాయిలో విచారణ జరిపించి పాఠశాలపై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'ఆర్థిక అక్షరాస్యత అందరికీ అవసరం'

గాలివీడు : ప్రతిఒక్కరూ ఆర్థిక విషయాలపై అవగాహన కలిగి ఉండాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ పి.పవన్ కుమార్ పేర్కొన్నారు. బుదవారం స్థానిక మండల సభాభవన్‌లో ఉపాధి సిబ్బందికి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క వయోజన పౌరుడు ఆరోగ్య, జీవిత, ప్రమాదబీమా చేయించుకోవాలని చెప్పారు. వృద్ధాప్య పింఛన్ పథకాలలో కూడా చేరి ఉండాలన్నారు.సైబర్ మోసాలు, పిఎంజెజెబివై, పిఎం ఎస్‌బివై గురించి తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకటేశ్వర, ఉపాధి ఇసి వెంకటసునీల్, శివానందరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు రమణరెడ్డి, శ్రీరాములు, వెంకటేశ్వరులు, వినోద్‌కుమార్, సునీత పాల్గొన్నారు.